క్లుప్తంగా

నిధులు మంజూరు చేయాలి



వినతిపత్రం అందిస్తున్న రత్నాకర్, స్వామి

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యాలయ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే పాయల్ శంకర్‌ను స్కౌట్స్ అండ్ గైడ్స్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు రత్నాకర్, కార్యదర్శి స్వామి కోరారు. జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. విద్యార్థుల్లో దేశభక్తి, క్రమశిక్షణ, సేవా దృక్పథాన్ని పెంపొందించడానికి వారికి శిక్షణ కార్యక్రమాలు అందిస్తామన్నారు. స్థలం చుట్టూ ప్రహరీ నిర్మించడంతో పాటు, కార్యకలాపాల కోసం భవనాన్ని సైతం నిర్మించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

తేమ శాతం తక్కువగా ఉండాలి



తేమశాతం చూస్తున్న డీఎస్‌వో సుధారాణి

ఉట్నూర్‌రూరల్: వడ్లు తూకం చేసే ముందు తేమశాతం తక్కువగా ఉండే విధంగా చూడాలని డీఎస్‌వో సుధారాణి అన్నారు. సోమవారం మండలంలోని గంగన్నపేట్, దంతన్‌పల్లి, బీర్సయాపేట్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరి కొనుగోళ్ల కేంద్రాలను తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ కొనుగోళ్ల కేంద్రంలో రైతులు తెచ్చిన వడ్లు ఆలస్యం చేయకుండా త్వరితగతిన కొనుగోళ్లు చేపట్టాలన్నారు.

5న ముగియనున్న సోయా కొనుగోళ్లు

బోథ్: బోథ్ మార్కెట్‌యార్డులో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న సోయా కొనుగోళ్లు ఈనెల 5న ముగుస్తాయని బోథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, సెంటర్ ఇన్‌చార్జి గోలి స్వామి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు తమ పంటను 5 తేదీ లోపు విక్రయించాలన్నారు.

సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

ఎదులాపురం: ములుగు జిల్లా ఏటూరు నాగారం మండలం చెల్పాక గ్రామ సమీపంలో జరిగిన ఎన్‌కౌంటర్‌పై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా కార్యవర్గ సభ్యులు వెంకటనారాయణ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. బీజేపీ, కాంగ్రెస్ కలిసి బూటకపు ఎన్‌కౌంటర్ చేశాయన్నారు.

ఇద్దరికి సీనియర్ నర్సింగ్ ఆఫీసర్‌గా పదోన్నతి

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్ ఆస్పత్రికి ఇద్దరు సీనియర్ నర్సింగ్ ఆఫీసర్లు పదోన్నతిపై వచ్చారు. సోమవారం విధుల్లో చేరారు. జైనథ్ మండలంలోని గిమ్మ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న గ్రేస్ మంజుల, నిర్మల్ మెడికల్ కళాశాలల్లో పనిచేస్తున్న వాసల్య ఇదివరకు నర్సింగ్ ఆఫీసర్లుగా విధులు నిర్వర్తించారు. వీరిద్దరికి పదోన్నతి లభించడంతో రిమ్స్‌లో విధుల్లో చేరారు.

క్రీడల నిర్వహణపై సమావేశం

బోథ్: ఈనెల 7 నుంచి నిర్వహించే సీఎం కప్ క్రీడ పోటీల నిర్వహణపై సీఎం కప్ మండల కన్వీనర్, ఎంపీడీవో రమేష్ అధ్యక్షతన ఎంఈవో పోశెట్టి, డిప్యూటీ తహసీల్దార్ మల్లేశ్ మండలంలోని పీడీ, పీఈటీలతో సోమవారం సమావేశం నిర్వహించారు. క్రీడల్లో పాల్గొనే యువతీ యువకుల సమాచారాన్ని ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేయించాలని, క్రీడాకారుల్లో అవగాహన కల్పించాలని సూచించారు.

క్రీడలతో బంగారు భవిష్యత్

తలమడుగు: క్రీడలతోనే బంగారు భవిష్యత్ ఉంటుందని మాజీ జెడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి అన్నారు. సోమవారం మండలంలో పల్సి(కె) గ్రామంలో విట్టల రుక్మాబాయి దేవాలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని గ్రామంలో కబడ్డీ పోటీలు ప్రారంభించారు. క్రీడలతో స్నేహభావం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కళ్యాణ లక్ష్మి రాజేశ్వర్, వెంకన్న యాదవ్, పాయల్, జ్ఞానేశ్వర్, రామ లక్ష్మణ్, రావుల నారాయణ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఇచ్చోడ: మండల కేంద్రంలోని 44వ జాతీయ రహదారిపై సోమవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో అక్షయ్, సతీష్‌లకు గాయాలయ్యాయి. స్థానికులు 108 అంబులెన్స్‌లో క్షతగాత్రులను ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలించారు. నాగ్‌పూర్ నుంచి హైదరాబాద్‌కు బొలేరా పికప్ వ్యానును వెనుక నుంచి లారీ ఢీ కొట్టడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది.

సాగునీరు అందేదెలా?

- అధ్వానంగా మత్తడివాగు ఎడమ కాలువ
- చివరి ఆయకట్టుకు అందని నీరు
- పట్టించుకోని అధికారులు



బండల్‌నాగాపూర్ వద్ద కాలువలో పెరిగిన పిచ్చిమొక్కలు

తాంసి: మత్తడివాగు ప్రాజెక్టు ఎడమ కాలువ అధ్వానంగా మారింది. పూర్తిస్థాయిలో ఆయకట్టు రైతులకు సాగునీరు అందడం లేదు. కాలువలో పిచ్చిమొక్కలు, తుంగ ఏపుగా పెరగడంతో సాగునీరు అందక రైతులకు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. వడ్డాడి వద్ద గత 15 సంవత్సరాల క్రితం నిర్మించిన మత్తడివాగు ప్రాజెక్టు ఎడమ కాలువ ద్వారా మండలంలోని వడ్డాడి, జామిడి, కప్పర్ల, బండల్‌నాగాపూర్, సావర్గాం, భీంపూర్ మండలంలోని పిప్పల్‌కోటి, నిపాని గ్రామాల శివారులోని రైతులకు సాగునీరు అందుతుంది. ప్రస్తుతం ఎడమ కాలువల్లో పూర్తిగా తుంగతో పాటు పిచ్చిగడ్డి నిండిపోయి ఉంది. పలుచోట్ల కాలువలు ధ్వంసమై, ఇరువైపులా పెద్దఎత్తున చెట్లు పెరిగాయి.

8500 ఎకరాలకు సాగునీరు..

మండలంలోని మత్తడివాగు ఎడమ కాలువ 13 కిలోమీటర్ల మేర ప్రవహించడంతో పాటు పిల్ల కాలువల ద్వారా వివిధ గ్రామాల రైతులకు 8500 ఎకరాలకు సాగునీరు అందుతోంది. కాలువలో తుంగ, పిచ్చి మొక్కలు ఏపుగా పెరగడంతో పాటు నీటి ప్రవాహాన్ని అడ్డుకోవడంతో సాగునీరు అందడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బండల్‌నాగాపూర్ గ్రామానికి చెందిన రైతులకు 480 ఎకరాలకు సాగునీరు అందించడానికి నిర్మించిన పిల్ల కాలువలో పూర్తిగా పిచ్చిమొక్కలతో నిండింది. పలుచోట్ల పాక్షికంగా దెబ్బతింది.

అందని సాగునీరు..

మండలంలోని వడ్డాడి, జామిడి, బండల్ నాగాపూర్, కప్పర్ల, సావర్గాం, పిప్పల్‌కోటి, భీంసరి, గోట్కూరి, జందాపూర్, భోరజ్, సిర్సన్న, తరోడా గ్రామాల రైతులకు సాగు అందించాల్సి ఉన్నా.. ఎడమ కాలువలో ఏపుగా పిచ్చిమొక్కలు పెరిగాయి. కాలువ లైనింగ్ దెబ్బతినడంతో పాటు పిల్ల కాలువలు కోతకు గురవడంతో లీకేజీలు ఏర్పడుతున్నాయి. చివరి ఆయకట్టు గ్రామాలైన గోట్కూరి, జందాపూర్, భోరజ్, తరోడా గ్రామాలకు సరిగా సాగునీరు అందడం లేదు. ప్రధాన కాలువలు, పిల్లకాలువలు దెబ్బతినడంతో సాగునీరు అందడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలువలకు మరమ్మతులు చేయాలని రైతులు కోరుతున్నారు.

మోటార్ దగ్గర కూర్చుండాల్సి వస్తుంది



కాలువ పక్కనున్న చేనులో 3.5 ఎకరాల్లో ప్రస్తుతం శనగ పంట వేశాను. కాలువల్లో తుంగ గడ్డి ఏపుగా పెరగడంతో నీటి ప్రవాహం సిరిగా లేదు. మోటార్‌లో చెత్త వచ్చి, గడ్డి వస్తుంది. మోటార్‌లోకి వెళ్లడంతో చెడిపోయే పరిస్థితి ఉంది. కాలువ దగ్గర కూర్చుని నీటిని అంస్తున్నాం. – గిజ్జ రమణ, వడ్డాడి రైతు

చర్యలు తీసుకుంటాం

మత్తడివాగు ప్రాజెక్టు ఎడమ, కుడి కాలువ ద్వారా పూర్తి స్థాయిలో సాగు నీటిని అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. కాలువల్లో పెరిగిన గడ్డి, తుంగ తొలగించేందుకు చర్యలు చేపడుతాం. కొంత మేర ఎడమ కాలువలో పూడికతీతలో తుంగను తొలగించాం.
– హరీశ్‌కుమార్, మత్తడివాగు ప్రాజెక్టు ఏఈ

గెలుపే ధ్యేయంగా పనిచేయాలి

- ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఆదిలాబాద్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ గెలుపే ధ్యేయంగా పనిచేయాలని అదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. బీజేపీ క్రమశిక్షణతో కూడుకున్న పార్టీ అని, పార్టీ నాయకత్వంపై నమ్మకాన్ని నిలబెట్టుకుంటే గెలుపు దానంతట అదే వస్తుందన్నారు. నిబద్ధత, నిజాయితీతో పనిచేస్తే ఎలాంటి పదవైనా చేరుకోవచ్చన్నారు. కమిటీలు సమర్థవంతంగా పనిచేసేలా నాయకులు సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. సమావేశంలో నాయకులు ఆకుల ప్రవీణ్, రఘుపతి, జోగు రవి, కృష్ణ యాదవ్, గొర్ల రాము, శ్రీనివాస్, సోమ రవి, సుభాష్, రాకేశ్, తదితరులు పాల్గొన్నారు.

పట్టుదల ఉంటే లక్ష్యాన్ని సాధించవచ్చు

ఆదిలాబాద్‌రూరల్: ప్రభుత్వ ఉద్యోగాల సాధన వెనక కఠోర శ్రమ దాగి ఉంటుందని, లక్ష్యసాధన కోసం దృఢ సంకల్పం పట్టుదలతో ముందుకు సాగాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. సోమవారం ఆదిలాబాద్ పట్టణంలోని శాంతినగర్‌లో గల పద్మశాలి సంఘ భవనంలో ప్రభుత్వ కొలువులు సాధించిన 40 మంది యువతీ యువకులకు పద్మశాలి అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ ఆధ్వర్యంలో ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైనా కుర్ర రమేశ్, కుసుమ గణేష్‌లను పదోన్నతి పొందిన ఎం జోత్స్న, చంద్రకళ, బేతలలిత, అర్చనలను సత్కరించారు. కార్యక్రమంలో బేత రమేశ్, శివకుమార్, లచ్చిరాం, చంద్రమోహన్, బొమ్మకంటి రమేశ్, చిలుక విలాస్, కట్కం రాందాస్, కాసర్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి



విద్యార్థులతో భోజనం చేస్తున్న అసిస్టెంట్ కలెక్టర్

తాంసి: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ట్రెయినీ అసిస్టెంట్ కలెక్టర్ అభిజ్ఞాన్ మాల్వియా అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమోన్నత పాఠశాలను తనిఖీ చేశారు. పాఠశాలలోని వంటగదిని పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా? లేదా? అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. డైనింగ్ హాల్‌లో విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. డిప్యూటీ తహసీల్దార్ జాదవ్ గణేశ్, ఆర్ఐ సంతోశ్, వార్డెన్ హరీశ్‌కుమార్, రాఘవేంద్ర ఉన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

ఇంద్రవెల్లి: ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై దుబ్బాక సునీల్ అన్నారు. సోమవారం మండలంలోని హీరాపూర్ కేజీబీవీ పాఠశాలతో పాటు పోస్ట్‌మెట్రిక్ వసతి గృహాన్ని సందర్శించారు. వసతి గృహానికి మెయిన్ గేట్‌ను మూసి ఉంచాలని, ఎవరిని లోనికి రానివ్వదన్నారు. ఎలాంటి సమస్య వచ్చినా.. సమాచారం ఇవ్వాలన్నారు.

నేరడిగొండ: మధ్యాహ్న భోజన నిర్వాహకులు విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంఈవో భూమారెడ్డి అన్నారు. సోమవారం నేరడిగొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన నిర్వాహకులు, ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. వంట చేసే సమయంలో జాగ్రత్తలు పాటించాలని, కిచెన్‌తో పాటు వంట పాత్రలను శుభ్రంగా ఉంచాలని సూచించారు. సమావేశంలో ఉపాధ్యాయులు, ఎంఐఎస్ కోఆర్డినేటర్ అనిల్, సీఆర్పీలు రవీందర్, వినోద్, సురేందర్ పాల్గొన్నారు.

గుడిహత్నూర్: విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ఇంటి వంటలా వండి పెట్టాలని ఎంపీడీవో మహ్మద్ అబ్దుల్ హై అన్నారు. సోమవారం స్థానిక ఎమ్మార్సీ భవనం వద్ద ఏర్పాటు చేసిన మధ్యాహ్న భోజన నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఎంఈవో ఉదయ్‌రావ్, హెచ్ఎం సంతోష్ కుమార్, నిర్వాహకులు పాల్గొన్నారు.

'విద్యార్థుల సంక్షేమాన్ని పట్టించుకోని ప్రభుత్వం'



మాట్లాడుతున్న ఫరీద్, నాయకులు

ఇచ్చోడ: గురుకుల పాఠశాలల విద్యార్థుల సంక్షేమాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం గాలికి వదిలేసిందని బీఆర్ఎస్వీ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ ఫరీద్ ఆరోపించారు. సోమవారం మండల కేంద్రంలోని మైనార్టీ గురుకుల పాఠశాల సందర్శించేందుకు వెళ్తుండగా.. పోలీసులు అరెస్టు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పేద, మధ్య తరగతి కుటుంబాల విద్యార్థుల కోసం అనేక సంక్షేమ గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేసిందన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థులకు సరైన వసతులు కల్పించడం లేదన్నారు. ఆయన వెంట జిల్లా అధ్యక్షుడు బుట్టి శివకుమార్, ప్రశాంత్, కృష్ణారెడ్డి, అబ్దుల్ల, రాజేశ్ ఉన్నారు.

'ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్'



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ఇంద్రవెల్లి: రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలతో ప్రజలను మోసం చేస్తోందని బీజేపీ రాష్ట్ర నాయకులు రాథోడ్ రేతేష్ ఆరోపించారు. సోమవారం మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో కాంగ్రెస్ ఆరు గ్యారంటీల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ప్రజలకు అనేక అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చిందన్నారు. ప్రతీ హామీని అమలు చేసి ప్రజలకు న్యాయం చేయాలన్నా రు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఆరెల్లి రాజలింగు, దిలీప్‌మోరే, ముండే సాయినందన్, రాథోడ్ రాధిక, మస్కే రాజువర్ధన్, దినేష్, ధన్‌సింగ్, రాజు, ప్రహ్లాద్ పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం



వంటకాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

ఆదిలాబాద్‌టౌన్: పౌష్టికాహారం తీసుకోవడంతోనే విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటారని ప్రధానోపాధ్యాయుడు లచ్చిరాం అన్నారు. సోమవారం ఆదిలాబాద్ పట్టణంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల బ్రాహ్మణవాడలో ఫుడ్‌మేళా నిర్వహించారు. విద్యార్థులు వివిధ వంటకాలను తయారు చేసి మేళాలో ప్రదర్శించారు. తోటి విద్యార్థులు వాటిని కొనుగోలు చేసి రుచి చూశారు. ఆకుకూరలు, కూరగాయలు, ప్రొటీన్లు, విటమిన్లతో కూడిన ఆహారం తీసుకోవడంతో విద్యార్థుల్లో ఎదుగుదల ఉంటుందని సూచించారు. కార్యక్రమంలో అర్బన్ రెసిడెన్షియల్ ప్రత్యేకాధికారి ప్రశాంత్ రెడ్డి, ఉపాధ్యాయులు అనిల్ కుమార్, అపర్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

సన్మానం

కైలాస్‌నగర్: తెలంగాణ రాష్ట్ర గిరిజన కోఆపరేటివ్ ఫైనాన్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ కొట్నాక తిరుపతిని యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్ రెడ్డి సోమవారం సన్మానించారు. మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షుడిగా ఇటీవల ఎన్నికైన కె.శివకుమార్‌ను రైతు సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో సత్కరించారు. కొండ రమేశ్, బండి దత్తాత్రి, గోవర్ధన్ యాదవ్, కొప్పుల దేవిదాస్, తదితరులు పాల్గొన్నారు.

బోథ్: మండల ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గ సభ్యులకు ఎంపీడీవో రమేశ్, ఎస్సై ప్రవీణ్, మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు శాలువాతో సత్కరించారు.

బంగ్లాదేశ్‌లో హిందువులకు రక్షణ కల్పించాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కైలాస్‌నగర్: బంగ్లాదేశ్‌లో మైనార్టీ హిందువులపై జరుగుతున్న దాడులను అరికట్టి, వారికి రక్షణ కల్పించేలా కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపాలని సనాతన హిందూఉత్సవ సమితి అధ్యక్షుడు ప్రమోద్ కుమార్ ఖత్రీ కోరారు. సోమవారం కలెక్టర్ రాజర్షి షాను కలిసిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత కొన్ని నెలలుగా బంగ్లాదేశ్‌లో హిందువులు, దేవాలయాలపై అక్కడి ప్రభుత్వం అండతో అల్లరి మూకలు దాడులు చేస్తు విధ్వంసం సృష్టిస్తున్నారన్నారు. భారత ప్రభుత్వం బంగ్లాదేశ్ ప్రభుత్వంతో వెంటనే చర్చించి శాంతియుత వాతావరణానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బండారి వామన్, గేడం మాధవ్, పడకంటి సూర్యకాంత్, కందుల రవీందర్, మదస్తు సంతోష్, ఉరడే సుభాష్, మహిపాల్, కిషన్ పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలి

ఇచ్చోడ: శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతిఒక్కరూ సహకరించాలని ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్ అన్నారు. సోమవారం పోలీస్‌స్టేషన్ ఆవరణలో మైక్రోఫైనాన్స్ వారు అందించిన 20 స్టాపర్లను ప్రారంభించారు. స్టాపర్ల ద్వారా ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, అత్యవసర సమయంలో వాహనాల తనిఖీలలో ఉపయోగపడుతాయన్నారు. కార్యక్రమంలో ఇచ్చోడ సీఐ భీమేశ్, ఎస్సై తిరుపతి, కంపెనీ లైజనింగ్ ఆఫీసర్ రమేశ్, ఏరియా మేనేజర్, బ్రాంచ్ మేనేజర్లు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఇచ్చోడ: మండల కేంద్రంలోని కస్తూరిబా పాఠశాలలో తాత్కాలిక పద్ధతిలో బోధించుటకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కేజీబీవీ ప్రత్యేకాధికారి మల్లిక తెలిపారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఎంఎస్సీ, లేదా బీఎస్సీ నర్సింగ్ చేసి ఆసక్తి గల అభ్యర్థులు తాత్కాలిక పద్ధతిలో బోధించేందుకు ఈనెల 4లోపు జీబీవీలో దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.

బోథ్: మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల కళాశాలలో తాత్కాలిక పద్ధతిలో పీజీ సీఆర్‌టీ (గణితం) పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎస్‌వో వలిత ఒక ప్రకటనలో తెలిపారు. గణిత శాస్త్రంలో ఎంఎస్సీ పూర్తి చేసి బీఈడీ పూర్తి చేసిన మహిళా అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. ఈనెల 4లోపు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు.

నార్నూర్: గాదిగూడ మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో అతిథి అధ్యాపకులుగా పనిచేసేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పాఠశాల ప్రత్యేకాధికారి సరస్వతిలు సోమవారం తెలిపారు. ఇంగ్లీష్, కెమిస్ట్రీ, ఫిజిక్స్, బాటని, జువాలాజీ సబ్జెక్టులలో బోధించేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు.

సంక్షిప్త వార్తలు

పత్తి పంట కాలాన్ని పొడగించొద్దు

ఆదిలాబాద్‌టౌన్(జైనథ్): పత్తి పంట కాలాన్ని పొడగించవద్దని వ్యవసాయ శాస్త్రవేత్తలు రాంప్రసాద్ అన్నారు. సోమవారం జైనథ్ మండలంలోని దీపాయిగూడ గ్రామంలో గల పత్తి పంటలను పరిశీలించారు. ప్రస్తుతం చలి ఎక్కువగా ఉన్న దృష్ట్యా పత్తిలో గులాబీ పురుగు ఉధృతిని గమనించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారులు అష్రఫ్, పూజ, తౌసిఫ్, రైతులు ఉన్నారు.

సేవాలాల్ మందిర నిర్మాణానికి స్థలం కేటాయించాలి

ఇచ్చోడ: గిరిజన ఆరాధ్య దైవమైన సంత్ సేవాలాల్ వర్ధంతిని పురస్కరించుకొని బంజారా మ్యూజియం సేవాలాల్ మహరాజ్ మందిర నిర్మాణం కోసం ఇచ్చోడలో ఎకరం స్థలం కేటాయించాలని కోరారు. సోమవారం బంజారా సంఘం నాయకులు ప్రజాఫిర్యాదుల విభాగంలో కలెక్టర్‌కు వినతిపత్రం అందచేశారు. నాయకులు శివలాల్ నాయక్, ఫకిర్‌దాస్, నరేందర్ నాయక్ ఉన్నారు.

మహిళలపై హింసను క్షమించవద్దు

గుడిహత్నూర్: మహిళలపై హింసను క్షమించవద్దని సఖీ సోషల్ కౌన్సలర్ లావణ్య పిలుపు నిచ్చారు. మహిళలపై హింసకు వ్యతిరేకంగా అంతర్జాతీయ ప్రచారోద్యమంలో భాగంగా మండలంలోని రాజీవ్ నగర్, ఎస్సీకాలనీ, హనుమాన్‌నగర్, ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల, ఆదర్శ పాఠశాల, స్థానిక జూనియర్ కళాశాలలో సఖీ కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. సమాజంలో మహిళలు ఎలాంటి వేధింపులకు గురైనా వెంటనే 181, 1098, 100 నంబర్లకు ఫోనుద్వారా సమాచారం ఇవ్వాలన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ఎదులాపురం: ఉపాధ్యాయ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందని పీఆర్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పర్వతి సత్యనారాయణ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. 317 జీవోతో ఉద్యోగ ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న ఇబ్బందుల పరిష్కారానికి ప్రభుత్వం క్యాబినెట్ సబ్ కమిటీని నియమించిందన్నారు. నవీన్ యాదవ్, సునీల్ కుమార్, సాయికృష్ణ, కిషోర్ పాల్గొన్నారు.

ఫుడ్‌పాయిజన్ ఘటనలు బీఆర్ఎస్ కుట్రే

కైలాస్‌నగర్: రాష్ట్రంలోని సంక్షేమ గురుకులాలు, వసతిగృహాల్లో జరుగుతున్న ఫుడ్ పాయిజన్ ఘటనల వెనుక బీఆర్ఎస్ రాజకీయ కుట్రకోణం ఉందని కాంగ్రెస్ నాయకులు గిమ్మ సంతోష్ రావు ఆరోపించారు. సోమవారం స్థానిక ప్రజాసేవభవన్‌లో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బద్నాం చేసి రాజకీయ లబ్ధి పొందేందుకు కుట్ర చేస్తుందన్నారు. నాయకులు దొగ్గలి రాజేశ్వర్, శ్రీలేఖ, బూర్ల శంకరయ్య, దాసరి ఆశన్న పాల్గొన్నారు.

108 వాహనాలు కేటాయింపు

ఇంద్రవెల్లి: మండల కేంద్రంతో పాటు మారుమూల గ్రామాల్లో 108 సేవలు మరింత మెరుగుపడన్నాయి. ముత్నూర్ గ్రామం నుంచి అందుబాటులో ఉంచి మారుముల గ్రామాల ప్రజలకు అంబులెన్స్ సేవలు అందించనున్నారు. సోమవారం హైదరాబాద్‌లో 108 అంబులెన్స్‌ల ప్రారంభోత్సవంలో అదనంగా 108ను ఇంద్రవెల్లి మండల కేంద్రానికి కేటాయించినట్లు పైలెట్ ఆత్రం అశోక్ తెలిపారు.

ప్రజాపాలన విజయోత్సవాలపై కళాజాత

బోథ్: ప్రజాపాలన విజయోత్సవాల కార్యక్రమాల సందర్భంగా మండల కేంద్రంలో కళాజాత ప్రదర్శన నిర్వహించారు. ప్రజాపాలన విజయోత్సవాలపై పాటలు పాడారు. కార్యక్రమంలో కళాజాత బృందం సభ్యులు చాకటి రవీందర్, రాజలింగు, రమేశ్, మురళి, నర్సమ్మ, రాజు, శ్రీలత, తదితరులు పాల్గొన్నారు.

అడవిపందుల దాడుల్లో పత్తి పంట ధ్వంసం

బోథ్: మండలంలోని కోటా(కె) గ్రామ శివారులో అడవి పందులు పత్తి పంటను ధ్వంసం చేస్తున్నాయి. ఆదివారం రాత్రి సమయంలో గ్రామానికి చెంది కాశీనాథ్, మాధవ్ కేంద్రెకు చెందిన చేనులో అడవి పందులు తిరిగాయి. దీంతో పత్తి కర్రలు నేల కొరిగాయి. ప్రభుత్వం తమకు నష్ట పరిహారాన్ని అందజేయాలని రైతులు కోరుతున్నారు.

చికిత్సతో కుష్ఠు నివారణ

నేరడిగొండ: చికిత్సతోనే కుష్ఠును నివారించవచ్చని నేరడిగొండ పీహెచ్‌సీ హెచ్‌ఈవో పవార్ రవీందర్ అన్నారు. కుష్ఠు గుర్తింపు సర్వేలో భాగంగా సోమవారం మండలంలోని కుమారి గ్రామంలో ఇంటింటా సర్వే నిర్వహించారు. ఎవరికైనా స్పర్శ లేని మచ్చలు శరీరంపై ఉంటే వైద్య సిబ్బందికి తెలియజేయాలన్నారు.

వ్యక్తిగత శుభ్రతతోనే ఆరోగ్యం

నేరడిగొండ: వ్యక్తిగత, పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యంగా ఉండవచ్చని నేరడిగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెచ్‌ఈవో పవార్ రవీందర్ అన్నారు. ఆరోగ్య పాఠశాల కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని కుమారి జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో ఉదయం ప్రార్థన సమయంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయుడు మధుసూదన్ రెడ్డి, హెల్త్ అసిస్టెంట్ సాయన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం

ఆదిలాబాద్: ఆదిలాబాద్ పట్టణంలోని బంగారిగూడ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 20 నుంచి 22 వరకు జరగనున్న బ్రహ్మోత్సవాలకు హాజరు కావాలని ఆలయ కమిటీ సభ్యులు స్వాస్ అధ్యక్షుడు కారింగుల ప్రణయ్‌కు ఆహ్వానం అందజేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో కలిసి ఆహ్వాన పత్రిక అందించారు.

ఆర్టీసీ ప్రయాణం సురక్షితం

ఉట్నూర్‌రూరల్: ప్రజలు ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించాలని ఉట్నూర్ డిపో సూపరింటెండెంట్ రాథోడ్ శకుంతల కోరారు. సోమవారం ఉదయం ఆర్టీసీ సేవలపై ప్రయాణికులకు అవగాహన కల్పించారు. ఆర్టీసీ బస్సులు సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుస్తాయని ప్రతిఒక్కరు టికెట్ తీసుకొని బస్సులో ప్రయాణించాలన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ కంట్రోలర్ దేవన్న, సిబ్బంది రవి, బస్సు కండక్టర్ పాల్గొన్నారు.

విద్యార్థులపై నిర్లక్ష్యం వద్దు

నార్నూర్: ఆశ్రమ పాఠశాలలో చదివే గిరిజన విద్యార్థులపై నిర్లక్ష్యం వద్దని, మెనూ ప్రకారం భోజనం అందించాలని జీసీడీవో ఛాయ అన్నారు. సోమవారం మండలంలోని మాన్కాపూర్, జామ్డాతో పాటు మండల కేంద్రంలోని బాలికల ఆశ్రమ పాఠశాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని వంటగదితో పాటు స్టోర్‌గదిని పరిశీలించారు. పాఠశాలలో రికార్డులను పరిశీలించి పలు సూచనలు చేశారు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రధానోపాధ్యాయుడు విఠల్, వార్డెన్ వనిత ఉన్నారు.

జయప్రదం చేయండి

తలమడుగు: డిసెంబర్ 7న నిర్వహించే సీఎం కప్ క్రీడలను జయప్రదం చేయాలని ఎంపీడీవో చంద్రశేఖర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మండలస్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జిల్లా స్థాయిలో క్రీడలను నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంఈవో వెంకట్‌రావు, ఎస్సై అంజమ్మ, హెచ్ఎం రామేశ్వరరావు, పీఈటీలు తదితరులు పాల్గొన్నారు.

సప్తాహ ముగింపు



పల్లకి ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

బేల: మండలంలోని కొబ్బాయి గ్రామంలో ఆధ్యాత్మిక గురువు బాజీరావు బాబా ఆలయ ప్రాంగణంలో వారం రోజులుగా చేపట్టిన బాజీరావు బాబా సప్తాహ ముగింపు వేడుకలను సోమవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి, ప్రధాన వీధుల గుండా పల్లకి ఊరేగించారు. ప్రధాన శిష్య బృందం ఆలయ ప్రాంగణంలో భగవద్గీత పారాయణం చేశారు. కార్యక్రమంలో వైద్య నానాజీ పాటిల్, బొదే అనిల్, నైతం పురుషోత్తం, బెదుర్కర్ గజానన్, బొదే సతీష్, కాడే శ్రీనివాస్, సంతోష్, హిరమన్, శ్రీరామ్ పాల్గొన్నారు.